ప్రజాశక్తి

ఆదివారం 25 డిసెంబర్ 2022

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

కోవిడ్‌పై సన్నద్ధత ఏదీ ?

◆ ప్రజల్లో 'నాలుగో దశ' భయం ◆ వ్యాక్సిన్ నిల్వలు లేవు
◆ సరిపడా లేని మందులు



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

కోవిడ్ నాలుగో దశ (ఒమిక్రాన్ బిఎఫ్-7) మొదలవుతుందన్న ప్రజల ఆందోళనకు తగినట్లు ప్రభుత్వ సన్నద్ధత కనిపించడంలేదు. సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో మందులు కాస్త ఉన్నప్పటికీ, ఇమ్యునైజేషన్ కార్యాలయంలో వ్యాక్సిన్ నిల్వలు ఒక్క డోస్ కూడా లేదు. గతంలో ఆయా ఆసుపత్రులకు సరఫరా చేసిన వ్యాక్సిన్ల నిల్వలు అక్కడక్కడ ఉండడం తప్ప, అవసరమైతే ఆసుపత్రులకు సరఫరా చేసేందుకు ఒక్క డోస్ కూడా నిల్వ లేని పరిస్థితి నెలకొంది.

వారం రోజుల క్రితమే వ్యాక్సిన్ నిల్వలు అయిపోయినప్పటికీ ప్రభుత్వం సరఫరా చేయలేదు. నాలుగో దశ కోవిడ్ భయంతో ఒకటి, రెండు దశల వ్యాక్సిన్ వేసుకోవాలన్నా, బూస్టర్ డోస్ తీసుకోవాలన్నా వేయగలిగిన పరిస్థితి ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో లేదు. కోవాగ్జిన్, కొవిషీల్డ్ వ్యాక్సిన్లు లేని విషయాన్ని కొన్ని రోజుల క్రితం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఇంకా రాలేదు. ప్రభుత్వాధికారుల గణాం కాల ప్రకారం కోవిడ్ టీకా మొదటి దశ రాష్ట్ర లక్ష్యానికి మించి జిల్లాలో జరిగింది. రాష్ట్ర లక్ష్యం 31,73,268 కాగా, జిల్లాలో 31,74,619 మందికి తొలిదశ టీకాలు వేశారు. రెండో డోసు వేసుకున్నవారి సంఖ్య 33,48,124గా ఉన్నట్లు చెబుతున్నారు. బూస్టర్ డోస్‌లు 12,18,891 మంది వేసుకున్నారు. ఇప్పుడు ఏ దశ టీకా వేసుకుందామన్నా నిల్వలు లేవు.

సర్జికల్ మాస్కులు 8.50 లక్షల వరకు తెప్పించారు. ఆర్‌టిపిసిఆర్ కిట్స్ కూడా సరిపడా లేకపోవడంతో అనుమానితులందరికీ పరీక్షలు చేయడంలేదు. విమానాశ్రయంలో ర్యాండమ్‌గా ఆర్‌టిపిసిఆర్ పరీక్షలు చేస్తున్నారు. జిల్లాలో జనవరి చివరి వారం లేదా ఫిబ్రవరి నుంచి కేసులు పెరిగే అవకాశముందని వైద్యశాఖాధికారులు అంచనా వేస్తున్నారు. సంక్రాంతి పండగకు ముందు షాపింగ్, పండగకు వేర్వేరు ప్రాంతాల నుంచి జరిగే రాకపోకలతో కేసులు పెరగనున్నాయని చెబుతున్నారు. కోవిడ్‌కు సంబంధించి సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో కోవిడ్ సంబంధిత మందులు, కిట్లు పరిమితంగా వున్నాయి. ఇవి కూడా గతంలో సరఫరా చేసిన వాటిలో మిగిలినవి తప్ప కొత్తగా ప్రభుత్వం మందులు పంపించలేదు. కేసులు పెరిగితే ఇవి కూడా ఏ మూలకూ సరిపోవు. రెమిడిస్‌విర్ ఇంజక్షన్లు 13 వేలకు పైగా వున్నాయి. టొసిలిజుమాబ్ 80 ఎంజి ఇంజక్షన్లు 20, యామ్‌ఫోటెరిసిన్ - బి50 ఎంజి ఇంజక్షన్లు 2869, పొసకోనాజోల్ ఇంజక్షన్లు 3833, హ్యూమన్ ఇమ్యునోగ్లోబ్యులిన్ 5 జిఎం 287 ఉన్నట్లు తెలిసింది. విటిఎంఎస్ లక్షా 70 వేలకుపైగా వున్నాయి. గ్లౌవ్స్ దాదాపు 13 లక్షల వరకు ఉన్నాయి. పిపిఇ కిట్స్ 22 వేలు, ఎన్ 97 మాస్కులు మూడు లక్షలకు పైగా వున్నాయి. 10 లీటర్ల ఆక్సిజన్ కాన్సెన్‌ట్రేటర్స్ 280, ఐదు లీటర్ల ఆక్సిజన్ కాన్సెన్‌ట్రేటర్స్ 90, బి టైప్ ఆక్సిజన్ సిలిండర్స్ నాలుగు వేలు, డి టైప్ ఆక్సిజన్ సిలిండర్స్ 1800 వరకు ఉన్నాయి. బారిసిటినిబ్ 4ఎంజి మాత్రలు 200, ఫాబిపిరవిర్ 200 ఎంజి క్యాప్సుల్స్ రెండు వేలు, హోమ్ ఐసోలేషన్ కిట్స్ 45 వేల వరకు ఉన్నాయి.



విశాఖ నగరంలోని ఓ చర్చి వద్ద ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలిపే ప్రదర్శనను తిలకిస్తున్న భక్తులు

క్రిస్మస్‌కు సర్వం సిద్ధం

ముస్తాబయిన చర్చిలు - విశాఖలో ఘనంగా ఏర్పాట్లు

వార్త 8లో..

మూఢ నమ్మకాల నిర్మూలనకు చట్టం చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పెరియార్ రామస్వామి ఆశయాల మేరకు మూఢ నమ్మకాల నిర్మూలన చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకురావాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు తుంపాల శ్రీరామమూర్తి విజ్ఞప్తి చేశారు. ప్రముఖ నాస్తిక ఉద్యమకారుడు పెరియార్ ఇవి.రామస్వామి 49వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆర్‌కె.బీచ్ వైఎంసిఎ ఎదురుగాగల ఆయన విగ్రహం వద్ద పెరియార్ ఆశయ సాధన సంఘం, భారత నాస్తిక సమాజం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కుల కోసం జీవితాంతం పెరియార్ పోరాడారని మిగతా 2లో..

కేంద్రీయ విద్యాలయాల్లో పోస్టుల భర్తీ ఫీజులను తగ్గించాలి

▶ వార్త 4లో..

సూక్ష్మ, ఆహార శుద్ధి పరిశ్రమలకు ప్రాధాన్యత

▶ వార్త 5లో..

సిఐటియు విశాఖ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

▶ వార్త 2లో..

జగనన్న కాలనీల నిర్మాణ పనులు వేగవంతం

- విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. శనివారం సాయంత్రం ఆయన ఆనందపురం మండలం దబ్బంద గ్రామంలో పర్యటించారు. టిడ్కో కాలనీ సమీపంలోని 12 ఎకరాల్లో 398 ఇళ్లతో ఉన్న జివిఎంసి లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంజూరైన 398 ఇళ్లలో 68 ఇళ్లను గ్రౌండింగ్ పూర్తయ్యేసరికి జంగిల్ క్లియరెన్స్ చేయాలని విఎంఆర్‌డిఎ డిఇని ఆదేశించారు. 398 ఇళ్లకు పది రోజుల్లోపు ప్లింత్ బీమ్‌లు వేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

స్థానిక డిప్యూటీ తహశీల్దార్, హౌసింగ్, సచివాలయ ఇంజినీర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, ఇఇ సత్యనారాయణ, విఎంఆర్‌డిఎ, రెవెన్యూ, హౌసింగ్ అధికారులు, వార్డు ఎమినిటీస్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

20, 21 తేదీల్లో ఇన్ఫినిటీ వైజాగ్ ఐటి సమ్మిట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో ఐటి వ్యవస్థను ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా వచ్చే ఏడాది జనవరి 20, 21 తేదీలలో విశాఖపట్నంలోని మారియట్ హోటల్లో ఇన్ఫినిటీ వైజాగ్ - 2023 పేరుతో ఐటప్ ఆధ్వర్యంలో ఐటి సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామని ఐటిఎఎపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ కొసరాజు తెలిపారు. శనివారం సాయంత్రం ద్వారకానగర్‌లోని ప్రముఖ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమ్మిట్ వివరాలను తెలియజేశారు. సమ్మిట్‌ను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్నామని, విశాఖ నగరంలో పెట్టుబడులు, అభివృద్ధికి ఉన్న అవకాశాలను ఈ సమ్మిట్ ద్వారా తెలియజేస్తామని అన్నారు. ఐటి రంగం స్టార్టప్‌లతో పాటు దేశంలోని వివిధ పరిశ్రమల అనుబంధ సంస్థలు, ఎంఎన్‌సి కంపెనీల నుంచి ఐటి ప్రముఖులు తరలివచ్చి ప్రసంగిస్తారని తెలిపారు. ఐటి, ఐటిఇఎస్ పరిశ్రమలకు చెందిన నిపుణులు కోర్ సాఫ్ట్‌వేర్ పరిశ్రమలో ఆటోమేషన్, సైబర్ సెక్యూరిటీ, ఇండస్ట్రీ 4.0లో ఎఐ గురించి వివిధ ప్యానెల్స్‌లో చర్చిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటి, రైల్వేలు, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటి, స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ అరవింద్ కుమార్ భాగస్వాములుగా ఉంటారన్నారు. ఎపి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు శ్రీనాథ్ దేవిరెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, మేడపాటి. ఎస్.వెంకట్, ఎపి స్టేట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్ గౌర్ హాజరుకానున్నారని తెలిపారు. సమావేశంలో ఐటప్ మాజీ అధ్యక్షులు రావి లక్ష్మీనారాయణ, సంస్థ సభ్యులు లక్ష్మి పాల్గొన్నారు.



సమ్మిట్ వివరాలు వెల్లడిస్తున్న ఐటిఎఎపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్

632వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా నిర్వహిస్తున్న ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయనున్నట్లు ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం తెలిపారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 632వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి ఇండస్ట్రియల్ ఏరియా కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ ఉండగా స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఏర్పాటైందని, ఈ కర్మాగారం రావడంతో విశాఖపట్నం స్టీల్ సిటీగా గుర్తింపు పొందిందని అన్నారు. ప్రత్యక్షంగా 30 వేల మందికి, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభించిందన్నారు. లాభాల్లో నడుస్తున్న ఈ కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయడం కోసం మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం దుర్మార్గమన్నారు. దీక్షల్లో కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.నర్సింగ్‌యాదవ్ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

మూఢ నమ్మకాల నిర్మూలనకు చట్టం చేయాలి

తెలిపారు. అలాగే పెళ్లిళ్లలో అర్థంలేని మంత్రాలు, సాంప్రదాయాల పేరుతో వృథా ఖర్చులు తగ్గించడం కోసం దండల పెళ్లిళ్ల, వితంతు వివాహాలను ప్రోత్సహించారని గుర్తుచేశారు. దళితసేన రాష్ట్ర అధ్యక్షులు పాల్తేటి పెంటారావు, భానాస జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు, ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు, డి.విజ్ఞానంద్, రాంప్రభు, ఎస్.అజయ్, సుధాకర్, ఎస్ఆర్.వేమన, ప్రసాదరావు, వి.శ్రీనివాసరావు, హరిబాబు, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యంలో..

సిపిఐ ఆధ్వర్యంలో పెరియార్ రామస్వామి వర్థంతి కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి పెరియార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఎ.విమల పాల్గొన్నారు.

26 నుంచి పిఎంజె బాస్కెట్‌బాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : చినవాల్తేరు కోటక్ స్కూల్ వేదికగా మూడు రోజులు పాటు పిఎంజె బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించనున్నట్లు సంస్థ ఆర్గనైజర్లు వేణుగోపాల్, వరుణ్ తెలిపారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టోర్నీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 26 నుంచి 28 వరకు కోటక్ స్కూల్‌లో ఈ టోర్నమెంటు జరుగనుందన్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ ఎంవివి.సత్యనారాయణ టోర్నీని ప్రారంభించనున్నట్లు తెలిపారు. విజేతలకు అతిథులు చేతుల మీదుగా 28న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ క్రీడాకారుల్లో క్రీడాస్ఫూర్తిని నింపేందుకు ఇటువంటి టోర్నీలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం కార్యదర్శి జి.భూషణ్‌రావు, కోశాధికారి బి.పరశురాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా టోర్నీ లోగోను ఆవిష్కరించారు.

రెస్పెక్ట్ సీనియర్ కేర్ రైడర్ ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సీనియర్ సిటిజన్స్ కోసం బజాజ్ అలయంజ్ జనరల్ ఇన్సూరెన్స్ ప్రత్యేక ఆరోగ్య బీమా 'రెస్పెక్ట్ సీనియర్ కేర్ రైడర్'ను ప్రారంభించిందని సంస్థ సిఇఒ తపన్ సంఘేల్ తెలిపారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వృద్ధాప్య తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యతలను నెరవేర్చడం కష్టంగా మారిందన్నారు. తాము ప్రారంభించిన రైడర్ తల్లిదండ్రుల బాధ్యతను సజావుగా నెరవేర్చడంలో సహాయపడుతుందన్నారు. బజాజ్ అలయంజ్ జనరల్ ఇన్సూరెన్స్ బీమా చేసిన వారికి సహాయం చేయడానికి విస్తృతమైన సర్వీస్ ప్రొవైడర్లతో జతకట్టిందన్నారు. అందువల్ల సాధ్యమైనంత ఎక్కువ సంరక్షణ సీనియర్లకు లభిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

కెవిపిఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) 2023వ సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం సాయంత్రం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జరిగింది. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎంవి.ప్రసాదరావు మాట్లాడుతూ కెవిపిఎస్ కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడుతోందన్నారు. మున్సిపల్ రంగంలో అత్యధిక మంది బడుగు బలహీన వర్గాలకు చెందిన కార్మికులే పని చేస్తున్నారని తెలిపారు. సామాజికంగా వెనుకబడిన పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం పథకాలన్నింటినీ రద్దు చేస్తోందన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తుంగలో తొక్కుతోందని, దళితులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.నూకరాజు, ఉరుకుటి రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఇ.ఆదినారాయణ పాల్గొన్నారు.

గిరిజనులకు నష్టం చేకూర్చే..
హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌పై పోరాటం

ప్రజాశక్తి -అనంతగిరి: గిరిజనులకు నష్టం చేకూర్చే హైడ్రో పవర్ ప్రాజెక్టు నిరాణాన్ని అడ్డుకుంటామని, దీనిపై పోరాటం చేస్తామని అల్లూరి సీతారామరాజు సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స తెలిపారు. అనంతగిరి మండలం టోకూరు పంచాయతీ చిట్టంపాడు గ్రామంలో సిపిఎం ప్రతినిధి బృందం పర్యటించింది. హైడ్రో పవర్ ప్రాజెక్టు ప్రభావిత అటవీ ప్రాంతాన్ని, గ్రామాలను పరిశీలించారు. చిటంపాడు, డి.కంభవలస, నందనపురం, కొత్తవలస తదితర గ్రామాల గిరిజనులతో మాట్లాడారు. అనంతరం అల్లూరి సీతారామరాజు సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ, గిరిజన హక్కులు, చట్టాలను ధిక్కరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహిస్తామని తెలిపారు. హైడ్రో పవర్ ప్రాజెక్టును కార్పొరేట్ సంస్థలైన అదానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతి మంజూరు చేయడం తమ రాజకీయ ప్రయోజనాల కోసమేనని విమర్శించారు. ఈ ప్రాంతంలో ఏళ్లుతరబడి ఆదివాసులు నివసిస్తున్నారని, ప్రాజెక్ట్ నిర్మాణంతో పరిసర ప్రాంతాల్లో వ్యవసాయంతో పాటు చింత, పనస, జీడీ మామిడి, సీతాఫలం వంటి అటవీ ఉత్పత్తులు కోల్పోపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. పీసా చట్టం, పంచాయతీ గ్రామ సభ ఆమోదం, గిరిజన సలహా మండలి తీర్మానం లేకుండా కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం రాజ్యాంగ విరుద్ధం అని విమర్శించారు.

రాజకీయ ప్రకటనలు.. పార్టీల్లో ప్రకంపనలు..

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ రాజకీయాలు.. పలు పార్టీలకు చెందిన నేతల మాటలు, ప్రకటనలతో తాజాగా చర్చనీయాంశం అవుతున్నాయి. సిబిఐ మాజీ డైరెక్టర్ జెడి లక్ష్మీనారాయణ విశాఖ పార్లమెంట్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతున్నట్లు ప్రకటించారు. అనేక పార్టీలు ఇప్పటికే తనను ఆహ్వానం పలికినప్పటికీ సిద్ధాంతాలు కలవకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. విభజన హామీలను కేంద్రం అమలు చేయడం లేదని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తోందని పత్రికా ప్రకటనలో పేర్కొనడం చెప్పుకోదగ్గ విషయమే. ఇప్పటికే విశాఖలో తాను చేపడుతున్న సేవా కార్యక్రమాలు తన గెలుపునకు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు జెడి. తన కుమార్తె అయిన ప్రియాంక విశాఖలోని తూర్పు అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి బరిలోకి దిగనుందంటూ ఆ ప్రకటనలో పేర్కొనడం చూస్తే జెడి ఫౌండేషన్ ద్వారా విశాఖపై తండ్రీ, కూతురు లెక్కల్లోనే కేంద్రీకరించారన్నది స్పష్టమవుతోంది.

రాజకీయాల్లో విశాఖకు తగ్గని వన్నె

రాష్ట్రం యావత్తూ విశాఖ వైపే దృష్టిసారించిందన్నది స్పష్టమవుతోంది... బయట నుంచి వచ్చిన పలువురు నాయకులు ఇక్కడ నుంచి గెలుపొంది ఉన్నత స్థితిలోకి వెళ్లడం తెలిసిందే. స్థానిక నేతలకు ఇక్కడ పెద్దగా రాజకీయ అధికార పదవులు దక్కకపోయినా బయట వారికి మాత్రం అగ్రతాంబూలంగానే విశాఖ ఉంటోందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఆర్థిక పరమైన అంశాలే 'దండలో దారం'లో సారంగా కనిపిస్తున్నాయి. అయితే, గతంలో జెడి విశాఖ ఎంపీగా పోటీచేసినప్పుడు నిధుల ఖర్చుకు ఏ మాత్రమూ ప్రాధాన్యం ఇవ్వకుండా తన ప్రతిష్టకు ఎన్ని ఓట్లు వస్తే అవి చాలు అని అనుకున్నట్లు స్పష్టమవుతోంది. ఈ సారి ఆ పలుకుబడి, అనుభవం పనిచేస్తుందన్న అంచనాతో ఉన్నారు. విశాఖకే రాష్ట్రంలో ఎందుకంత రాజకీయ ప్రాధాన్యం అని చూస్తే ఇక్కడ ప్రభుత్వ రంగ సంస్థలు, భారీ ప్రయివేటు పరిశ్రమలు, ప్రధానంగా ప్రభుత్వ పోర్టు, ప్రైవేట్ పోర్టు



కార్యకలాపాలు. రియల్ ఎస్టేట్ వ్యాపార రంగానికి విశాఖపట్నం దిక్సూచిగా మారిపోయింది. పరిపాలనా రాజధాని గనక వస్తే ఈ వాతావరణం మరింత వేడెక్కనుంది. సముద్ర తీరంలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కావడంతో మరింతగా వ్యాపారాలకు అనువుగా మారిపోయింది. పోర్టు కార్గో హేండ్లింగ్, ఎగుమతి, దిగుమతుల ద్వారా రూ.కోట్లకు పడగలెత్తడం వంటివి విశాఖకు తరలి వచ్చిన నేతలంతా చూసుకునే వ్యవహారాలే. నాటి ఎంవివిఎస్.మూర్తి నుంచి బిజెపి నుంచి గెలిచిన కంభంపాటి హరిబాబు, నేటి ఎంవివి.సత్యనారాయణ వరకూ పలువురి నేపథ్యం వ్యాపార కార్యకలాపాలే. ఇదే వారి రాజకీయ పెట్టుబడిగా మారిందని చెప్పొచ్చు.

మాజీ జెడిదో ప్రత్యేకం

మాజీ జెడి లక్ష్మీనారాయణ.. ఇండిపెండెంట్ అభ్యర్థి. ఈ విషయంపై ఇతర పార్టీలకు ఎలాంటి అభ్యంతరమూ ఉండదు. కానీ ప్రధాన పార్టీలకు ఆయన అభ్యర్థిత్వం కాస్త భయాందోళన కలిగించేదే. ఎవరినైనా ఓడించే ఓట్లు ఆయనకు గ్యారెంటీ. ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, టిడిపిల పరిస్థితి ఇది కాదు. స్థానికంగా తూర్పు నియోజకవర్గం నుంచి వైసిపి టికెట్ 2019లో వంశీకృష్ణ ఆశించి భంగపడ్డారు. బయట నుంచి వచ్చిన అక్కరమాని విజయనిర్మలకు ఆ పార్టీ కట్టబెట్టింది. తర్వాత వంశీకి ఎంఎల్‌సి ఇచ్చేసి పక్కనపెట్టారు. దక్షిణంలో వాసుపల్లి గణేష్‌కుమార్ వైసిపి తరుపున ఉన్నారు. దీంతో అనేక మంది ఆ పార్టీ సీనియర్ నాయకులు ఆశలు వదులుకున్నారు. తాజాగా 2024 ఎన్నికలకు బ్రాహ్మణ కార్పొరేషన్ ఎపి ఛైర్మన్ సీతంరాజు సుధాకర్ బరిలోకి దిగాలనుకోగా ఆయనను ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైసిపి అధిష్టానం ప్రకటించింది. పార్టీ శ్రేణులన్నీ ఆయన్ని గెలిపించుకోడానికి శతవిధాలా ప్రయత్నాలు ప్రారంభించాయి. విశాఖలోని 4 ప్రధాన సీట్లు ఉన్నా ఉత్తరంపైనే ఆ పార్టీ నేతలు దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి ఉత్తరంపై సమీక్షలు తరచూ నిర్వహించడం తెలిసిందే. పశ్చిమం, తూర్పును పూర్తిగా వదిలేసినట్టుగా.. అవి టిడిపి ఖాతా అన్నట్లుగా వైసిపి భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

సిఐటియు విశాఖ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్



నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్, కోశాధికారి జ్యోతీశ్వరరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రెండు రోజులపాటు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన సిఐటియు విశాఖ జిల్లా 12వ మహాసభ నూతన కమిటీని ఎన్నుకుంది. నూతన కమిటీ అధ్యక్షులుగా కెఎం.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌కెఎస్‌వి.కుమార్, కోశాధికారిగా ఎస్.జ్యోతీశ్వరరావు ఎన్నిక య్యారు. ఉపాధ్యక్షులుగా పి.వెంకటరెడ్డి, పి.మణి, కెఎం.కుమార్‌మంగళం, ఎం.సుబ్బారావు, యు.రామస్వామి, ఎ.సీతా లక్ష్మి, బి.తులసి, జి.అప్పలరాజు, ఆర్.లక్ష్మణ మూరి, ఆర్ఎస్ఎన్.మూర్తి, కార్యదర్శులుగా ఎం.జగ్గునాయుడు, బి.జగన్, జి.శ్రీనివాస్, ఒ.అప్పారావు, బి.రత్నం, వి.మేరి, జి.మంగశ్రీ, పి.అనసూయ, ఎ.లోకేష్ , యు.రాజు ఎన్నికయ్యారు. వీరితో పాటు 70 మందితో జిల్లా కమిటీ, 144 మందితో జిల్లా కౌన్సిల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సిఐటియు విశాఖ జిల్లా నూతన ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘం విశాఖ జిల్లా 12వ మహాసభలు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో దిగ్విజయంగా జరిగాయన్నారు. ఈ మహాసభలకు జిల్లాలో 50 వేల మందికి నాయకత్వం వహిస్తున్న నాయకులు 335 మంది ప్రతినిధులుగా హాజరయ్యారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టే విధంగా కార్మిక పోరాటాలను ఉధృతం చేయాలని ఈ మహాసభ దిశానిర్దేశం చేసిందన్నారు. స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమల రక్షణ, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల పర్మినెంట్, కనీస వేతనం రూ.26 వేలు అమలు, తోపుడుబండ్లు, బిల్డింగ్, ఆటో, ముఠా వంటి అసంఘటితరంగ కార్మికులకు ఉపాధి రక్షణ, స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత, ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ వంటి ప్రధాన అంశాలపై స్వతంత్ర కార్యాచరణతో పాటు ఇతర కార్మిక, ప్రజా సంఘాలతో ఐక్య కార్యాచరణలతో పోరాటాలను ఉధృతం చేయడానికి మహాసభ నిర్ణయించిందన్నారు. కార్మికులకు ద్రోహం చేసే రాజకీయ పార్టీలను, ప్రభుత్వాలను ఓడించే విధంగా 2024 ఎన్నికల్లో క్యాంపెయిన్ నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. ఈ మహాసభలో కార్మికులు, ప్రజలెదుర్కొంటున్న 36 సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని తీర్మానాలు చేశామన్నారు. 2023 జనవరి 2 నుంచి 4 వరకు భీమవరంలో సిఐటియు రాష్ట్ర 16వ మహాసభలు జరుగనున్నాయని, వీటికి జిల్లా నుంచి 44 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై దీనిలో కూడా చర్చిస్తామన్నారు.

కనీస వేతనాల కోసం రాష్ట్ర జాతాలు

కనీస వేతనం రూ.26 వేలు అమలు కోసం శ్రీకాకుళం జిల్లా మందస నుంచి, అలాగే చిత్తూరు, హిందూపూర్ ప్రాంతాల నుంచి వేర్వేరు జాతాలు ఈ నెల 27న ప్రారంభమై భీమవరం వరకు కొనసాగుతాయన్నారు. భీమవరంలో 16వ రాష్ట్ర మహాసభలు జనవరి 2 నుంచి 4 వరకు జరుగుతున్న నేపథ్యంలో ఈ జాతాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ జాతాలకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.నర్సింగరావు, ఎంఎ.గఫూర్, కె.అజయ్ కుమార్‌లు నాయకత్వం వహిస్తున్నారన్నారు.

అందులో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభమయ్యే జాతా ఈ నెల 29న విశాఖ నగరానికి చేరుకుంటుందన్నారు. ఆరోజు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సభ ఉంటుందని తెలిపారు. జాతాకు నాయకత్వం వహిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు తదితరులు ప్రసంగిస్తారని చెప్పారు.

ఆయా జాతాలను కార్మికవర్గం జయప్రదం చేయాలని కోరారు. మీడియా సమావేశంలో సంఘం జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, ఉపాధ్యక్షులు పి.మణి పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై అవగాహన

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని చందక గ్రామంలో ట్రాఫిక్‌పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం మాట్లాడుతూ, రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, తాగి వాహనం నడపకూడదని, మైనర్లకు ఎటువంటి వాహనాలనూ తల్లిదండ్రులు ఇవ్వకూడదని చెప్పారు. అతివేగం, మద్యం తాగడం, హెల్మెట్ ధరించకపోవడం వంటి కారణాలతో ప్రమాదాల్లో ప్రాణాలు ఎక్కువగా కోల్పోతున్నారని వివరించారు.



కన్జ్యూమర్ డేలో మాట్లాడుతున్న మేయర్

హక్కులపై అవగాహన అవసరం : మేయర్

ప్రజాశక్తి-సీతమ్మధార : వినియోగదారులంతా వారి హక్కులపై అవగాహన కలిగి ఉండాలని మేయర్ గొలగాని హరివెంకట కుమారి పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో నేషనల్ కన్స్యూమర్ రైట్ కమిషన్ చైర్మన్ డాక్టర్ సాయిరమేష్ రాజ్బుల్ ఆధ్వర్యాన శనివారం ఏర్పాటుచేసిన నేషనల్ కన్జ్యూమర్ డే కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోసపూరితమైన ప్రకటనలు నమ్మరాదని, నాణ్యమైన ఉత్పత్తుల ఎంపిక, వాటి ధర ఆధారంగా వస్తువులను కొనుగోలు చేయాలని తెలిపారు. వస్తువుల నాణ్యత సరైనది కానప్పుడు వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కన్జ్యూమర్ చట్టాన్ని రూపొందించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ అంబుడ్స్ మ్యాన్ వైసిహెచ్ దొర, కన్జ్యూమర్ రైట్ ప్రతినిధులు తనుంజన్‌రెడ్డి, జి.వెంకటేశ్వరి, పొట్నూరు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఆచార్య నరసింహారావు

ప్రజాశక్తి-విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగ ఆచార్యులు ఎ.నరసింహారావు నియమితులయ్యారు. ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ నియామక ఉత్తర్వులను నరసింహారావుకు అందజేశారు. అనంతరం ఆచార్య నరసింహారావు ప్రిన్సిపల్‌గా బాధ్యతలను చేపట్టారు. గతంలో ఆచార్య నరసింహారావు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైన విద్యార్థులకు విసి అభినందనలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి ఏయూ పరిధిలోని ఆదిత్య కళాశాల నుంచి పి.రమ్య, ఏయూ ఫార్మసీ కళాశాల నుంచి జె.వాసు, స్పేసెస్ డిగ్రీ కళాశాల నుంచి వివిఎస్ఎన్.లక్ష్మణ్‌లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో ముగిసిన వర్క్‌షాపు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్ (సిసిఆర్‌టి), డైట్ సంయుక్తంగా పలు అంశాలపై నిర్వహించిన వర్క్ షాప్ శనివారంతో ముగిసింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో వెలుగులోనికి రాని చారిత్రక అంశాలు, సంస్కృతి సంప్రదాయాలు, స్వాతంత్ర్య సమర యోధుల చరిత్రను డిజిటల్ రూపంలో రూపొందించేందుకు ఏర్పాటుచేసిన వర్క్ షాప్‌లో పాల్గొన్న ఔత్సాహికులకు ఆర్‌పిలు శిక్షణ ఇచ్చారు. వీరితో పాటు పాల్గొన్న వారిని అభినందిస్తూ సర్టిఫికెట్లు అందజేశారు. డైట్ ప్రిన్సిపల్ యు.మాణిక్యంనాయుడు, సిసిఆర్‌టి కన్సల్టెంట్ వై.చంద్రశేఖర్, ఫీల్డ్ ఆఫీసర్ సౌందర్య కౌశిక్, సోమిశెట్టి సరళ, కెవిఎస్ఎస్ ప్రసాద్, రిసోర్స్ పర్సన్లుగానూ, ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌గా అధ్యాపకులు ఎస్‌కె అల్లాఉద్దీన్ వ్యవహరించారు. అధ్యాపకులు నాగేశ్వరరావు, మాధవి, త్రినాథరావు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న డైట్ ప్రిన్సిపల్ మాణిక్యంనాయుడు

శొంఠ్యాంలో వైద్యశిబిరం



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు వాలంటీర్లు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం నడింపల్లి సత్యనారాయణరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం, అనిల్ నీరుకొండ ఆసుపత్రి ఆధ్వర్యాన సొంఠ్యాం గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 110 మందికి వైద్య సేవలు అందించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలున్న వారిని శిబిరానికి తీసుకొచ్చి వైద్యాన్ని అందించారు. జనరల్, ఆర్థో, డెంటల్ విభాగంలోని పదిమంది డాక్టర్లు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ప్రసాద్‌రాజు, ఎన్ఎస్ఎస్ హెడ్ డాక్టర్ హరికృష్ణ, కళాశాల డైరెక్టర్ డాక్టర్ జె మురగదాస్, స్థానిక వైసిపి నాయకులు లంక రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడిని ఆదుకోవాలి


ప్రజాశక్తి-ఆనందపురం : పారిశుధ్య కార్మికునిగా 12 సంవత్సరాలు పనిచేసి పక్షవాతానికి గురైన తర్లువాడ గ్రామానికి చెందిన పారుపిల్ల పైడిరాజును ఆదుకోవాలని జనసేన నాయకులు మజ్జి శ్రీను, చందల అప్పలరాజు కోరారు. పైడిరాజు వేములవలస పంచాయతీలో 12 ఏళ్లుగా పారిశుధ్య పనులుచేస్తున్నాడని తెలిపారు. ఇటీవల ఆయన పక్షవాతానికి గురై మంచానికే పరిమితమయ్యారని, నిరుపేద కుటుంబం కావడంతో పూర్తిస్థాయి వైద్యం అందించలేకపోతున్నారని పేర్కొన్నారు. మజ్జి శ్రీను, చందల అప్పలరాజు, మరి కొంతమంది సహాయంతో సమకూర్చిన రూ.12 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పైడిరాజు కుటుంబానికి ఆర్థిక సాయం, పింఛను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్, పరిమి భువనేశ్వరి, కృష్ణయ్య, మీసాల నాగేశ్వరరావు, తమ్మిన అప్పలరాజు, తాడివాడ శివకృష్ణ, తాడివాడ ప్రశాంత్ నాయుడు, దుక్క వెంకట్రావు, మజ్జి నాగరాజు, బాయిన ఆనంద్, కోరాడ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్యకార్మికునికి ఆర్థిక సాయం అందజేస్తున్న జనసేన నాయకులు

ఘనంగా సిపిఐ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి -కంచరపాలెం : సిపిఐ 98వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ ఉత్తర నియోజకవర్గ సమితి ఆధ్వర్యాన కంచరపాలెం ముత్యాలమ్మ గుడి జంక్షన్ నుంచి కప్పరాడ నేషనల్ హైవే సర్వీస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ పతాకాన్ని జీవీఎంసీ సిపిఐ ఫ్లోర్ లీడర్ ఎజె.స్టాలిన్ ఆవిష్కరించారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, విద్యార్థులు, రైతులు, కార్మికులు, కర్షకులు, మహిళలు తదితర అన్ని వర్గాల ప్రజల హక్కుల కోసం సిపిఐ పోరాడుతోందనానరు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడుస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం కులం, మతం పేరుతో దేశ ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ పరిపాలన కొనసాగిస్తుందన్నారు. ఇటువంటి దుష్ట పరిపాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ, టిడ్కో గృహాలను స్థానికులకే కేటాయించాలని, అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని, కుంటి సాకులతో తొలగించిన రేషన్ కార్డులను, పెన్షన్లను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.విమల, ఎస్‌కె.రెహమాన్, ఆర్.శ్రీనివాసరావు, వి.నల్లయ్య, నాగభూషణం, నూకాలమ్మ, ఆదారి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



బహిరంగసభలో మాట్లాడుతున్న జెవి.సత్యనారాయణమూర్తి

నేరాలు ఘోరాలు

పెంకుటిల్లు దగ్ధం

ప్రజాశక్తి-పెందుర్తి : మండలంలోని చింతల అగ్రహారంలో శనివారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ పెంకుటిల్లు దగ్ధమైంది. బాధితుడు కడియం కనకరాజు కథనం ప్రకారం... ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తలెత్తి దగ్ధమైందని తెలిపారు. ఈ ప్రమాదంలో బంగారం, వెండితోపాటు రూ.3.50 లక్షలు కాలి బూడిదయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. అమ్మాయి రజస్వల వేడుకల కోసం నగదు, ఏడు తులాల బంగారం, 50 తుల వెండి తెచ్చి ఇంట్లో దాచుకున్నట్లు తెలిపారు. ఈ అగ్నిప్రమాదం వల్ల మొత్తం కోల్పోయామని కనకరాజు కుటుంబం కన్నీరు మున్నీరైంది.

ఉద్యోగాల పేరిట మోసగించిన నలుగురు అరెస్టు

ప్రజాశక్తి -మధురవాడ : ఆర్మీ ఉద్యోగం పేరిట మోసం చేసిన నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పిఎం.పాలెం సిఐ వై.రామకృష్ణ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... మధురవాడ బోరవానిపాలెం డ్రైవర్స్ కాలనీకి చెందిన నర్స శివాజీ, చోడవరం ప్రాంతానికి చెందిన తీగల సత్య శ్రీనివాస్, నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కోడూరు శ్రీనివాస్, ధవళ ప్రసాద్‌కుమార్ తదితరులు ముఠాగా ఏర్పడి నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆశ చూపి సుమారు రూ.60 లక్షల వసూలు చేశారు. మారికవలసకు చెందిన హరీష్ కొంత నగదు ఇచ్చాడు. ఎంతకీ ఉద్యోగం రాకపోవడంతో అతడు పిఎం.పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సిఐ రామకృష్ణ కేసు నమోదుచేసి విచారించారు. నిందితులను అరెసుటచేసి రిమాండ్‌కు తరలించారు.

భగవద్గీత పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సత్యనారాయణపేట గీతా మందిరంలో శనివారం జరిగిన భగవద్గీత మౌఖిక పోటీల్లో చిట్టివలస శ్రీరామకృష్ణా విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 5వ తరగతి విద్యార్థి బి.హరిణికీర్తన ప్రథమ స్థానంలో నిలిచింది. జి.గ్రీష్మప్రియ ప్రోత్సాహక బహుమతి గెలుచుకుంది. పి.కార్తికేయ తృతీయ బహుమతి గెలుచుకోగా, 4, 7, 9 తరగతుల విద్యార్థులు టి.తన్మయిశ్రీనిధి, జి.ప్రణీత, టి.చందన, ఎం.హర్షవర్ధన పలు బహుమతులను గెలుచుకున్నారు. గెలుపొందిన వారికి ప్రముఖ పద్య కవి బులుసు వెంకటేశ్వర్లు ద్వారా బహుమతులు అందజేశారు. పాఠశాల డైరెక్టర్లు ఎంవి.శివసాయికుమార్, ఎస్.ప్రసాదరావు పాల్గొన్నారు



బహుమతి అందజేస్తున్న పద్య కవి బులుసు వెంకటేశ్వర్లు



స్టీల్ బిందెలు, గ్లాసులు పంపిణీ చేస్తున్న ప్రసాదరావు పట్నాయక్

స్టీల్ బిందెలు, గ్లాసుల పంపిణీ

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం వెల్లంకి గ్రామంలోని అంగన్‌వాడీ విద్యార్థులకు శుభ బలరామ సేవా ట్రస్ట్ చైర్మన్ ప్రసాదరావు పట్నాయక్ ఆర్థిక సాయంతో స్టీల్ బిందెలు, గ్లాసులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ కార్యదర్శి కె.శివప్రసాదరావు మాట్లాడుతూ, మాజీ ప్రధాని వాజ్‌పాయ్ జయంతి సందర్భంగా ప్రసాదరావు పట్నాయక్ పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకుడు ఉప్పాడ అప్పారావు, మీసాల రాములునాయుడు, బోర శ్రీను, పి.సాయి రమేష్, గండ్రెడ్డి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

50 మందికి రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి, ఒకటో వార్డు పరిధి బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రెడ్డిపల్లి అప్పలరాజు తన సొంత నిధులతో సమకూర్చిన రగ్గులను శనివారం సుమారు 50 మంది నిరుపేదలకు పంపిణీ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుఎస్ఎన్.రాజు

కేంద్రీయ విద్యాలయాల్లో పోస్టుల భర్తీ ఫీజులను తగ్గించాలి

ప్రజాశక్తి -కంచరపాలెం : కేంద్రీయ విద్యాలయాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి నిర్ణయించిన పరీక్ష ఫీజును వెంటనే తగ్గించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కంచరపాలెంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రీయ విద్యాలయాల్లో ఉద్యోగాలకు ఒక పోస్టుకు రూ.2,300 పరీక్ష ఫీజు పెట్టడం దారుణమన్నారు. పరీక్ష నిర్వహణ పేరిట భారీ ఎత్తున ఫీజు వసూలుచేయడం నిరుద్యోగులను లూటీ చేయటమేనని విమర్శించారు. ఉద్యోగ అభ్యర్థులు ఫీజు చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 4, 5 రకాల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేయాలంటే రూ.10 వేలకు పైగా ఫీజు చెల్లించాలని, ఇది పేదలకు మోయలేని భారం అని పేర్కొన్నారు. వెంటనే ఈ ఫీజులు తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయానికి వ్యతిరేకంగా అభ్యర్థులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పి.విజయ, జోన్ కార్యదర్శి ఎస్.శ్రావణ్ కుమార్, శరత్, వార్డు అధ్యక్ష కార్యదర్శులు బి.మురళి, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

గంగవరం పోర్టులో కిసాన్ దివస్

ప్రజాశక్తి -గాజువాక : అదాని గంగవరం పోర్టులో శనివారం కిసాన్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. గంగవరం పోర్టు, ఇండియన్ పొటాష్ లిమిటెడ్, భారతి లిమిటెడ్ కో-ఆపరేటివ్ అధికారులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా అదాని గంగవరం పోర్టు సిఇఒ బిజి.గాంధీ మాట్లాడుతూ, రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు నాణ్యత పాడవకుండా ఉండడానికి 11 వేల చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగిన గిడ్డంగి ఐదని తెలిపారు. మరో 7 వేల విస్తీర్ణం కలిగిన వేర్ హౌస్ నిర్మాణంలో ఉందని వివరించారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కెటిబి సంఘం నాయకులు

శ్రీకృష్ణదేవరాయ కెటిబి ఆత్మీయ సమావేశం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 70 వార్డుకు చెందిన శ్రీకృష్ణదేవరాయ కెటిబి సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు చేతన అప్పారావు, రాజారావు మాట్లాడుతూ, 70వ వార్డుకు చెందిన కెటిబి కుటుంబ సభ్యులందరూ ఈ నెల 25వ తేదీన ఆటోనగర్ మామిడి తోట వద్ద జరగనున్న ఆత్మీయ సమావేశానికి హాజరు కావాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అనంతరం బహుమతుల ప్రదానం ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు జోజి, ప్రధాన కార్యదర్శి పప్పల కృష్ణ, ఉపాధ్యక్షులు సత్తిరాజు, ప్రగడ సంజీవరావు, మూర్తి, గొన్న శ్రీనివాసరావు, చేతన శ్రీను, తంపాల చిరంజీవి, రాంబాబు, ఐఒసి చిరంజీవి, గౌరీనాయుడు పాల్గొన్నారు.

14వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 14వ వార్డు పరిధి బాలయ్య శాస్త్రి లే-అవుట్, టిపిటి కాలనీ, ఎన్ఆర్ఐ హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ కటారి అనీల్‌కుమార్‌రాజుతో కలిసి ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ఇంటింటికీ వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె రాజు మాట్లాడుతూ, కులమతాలకతీతంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాక్సర్ రాజు, రాయుడు శ్రీను, సమ్మెట్ల వెంకటేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు ప్రజా గర్జనను విజయవంతం చేయండి


సమావేశంలో అభివాదం చేస్తున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జనవరి 27న సాయంత్రం ఉక్కునగరం త్రిష్ణ మైదానంలో జరిగే ఉక్కు ప్రజా గర్జనను కుటుంబ సభ్యులతో పాల్గొని విజయవంతం చేయాలని ఉక్కు పర్మినెంట్, కాంట్రాక్టు కార్మిక వర్గానికి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పిలుపునిచ్చింది. ఉక్కునగరంలోని ఎఐటియుసి కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడారు. త్యాగాల పునాదుల మీద ఏర్పాటైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం నూటికి నూరు శాతం అమ్ముతామని ప్రకటించడం దుర్మార్గమన్నారు. ఎన్నో పోరాటాలు, 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని బడా కార్పొరేట్ శక్తులకు కట్ట బెడితే చూస్తూ ఊరుకోబోమని స్పష్టంచేశారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశానికే తలమానికమైన విశాఖ ఉక్కు కర్మాగారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రధాన ఆర్థిక వనరు అన్నారు. ఈ కర్మాగారం వల్ల సుమారు 32 వేల మంది శాశ్వత, ఒప్పంద కార్మికులు ప్రత్యక్షంగా ఉపాధి పొందటంతో పాటు మరో లక్ష మంది పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఉక్కునగరంలో జరిగే ఉక్కు ప్రజా గర్జనకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షస్థాయి నేతలను, రాష్ట్ర, జాతీయ కార్మిక సంఘాల నేతలను ప్రసంగించడానికి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పోరాట కమిటీ నేతలు కెఎస్ఎన్.రావు, జె.రామకృష్ణ, ఎ.మసేనరావు, డొక్కా నర్సింగరావు, నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, కొరివి అవతారం, యు.రామస్వామి, వైటి.దాసు, శ్రీనివాసరాజు, జిఆర్‌కె.నాయుడు, విళ్ళ రామ్మోహన్‌కుమార్, కోగంటి లెనిన్‌బాబు, బొడ్డు పైడిరాజు, ఉగ్రం, జి.గణపతిరెడ్డి, దొమ్మేటి అప్పారావు, గాలి నాయుడు, పిట్టా రెడ్డి, కొమ్మినేని శ్రీనివాసరావు, మంగా వెంకట్రావు, కె.వరంధామయ్య, డివి రమణారెడ్డి, సిహెచ్.సన్యాసిరావు, వి.రామ్‌కుమార్, ఎం.ప్రసాద్, మహాలక్ష్మి నాయుడు, కె.శ్రీనివాస్‌నాయుడు, గుమ్మడి నరేంద్ర, వి.ప్రసాదు, టి.ఈశ్వరరావు, కోరాడ వెంకట్రావు, బంటు రాము, ఇందల శివ, బికె నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తరం'లో కలిసికట్టుగా పనిచేయాలి : సుబ్బారెడ్డి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-సీతమ్మధార : రాబోయే ఎన్నికల్లో ఉత్తర నియోజకవర్గంలో విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఉత్తరాంధ్ర జిల్లాల వైసిపి ప్రాంతీయ సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి కోరారు. మద్దిలపాలెంలోని వైసిపి కార్యాలయంలో శనివారం జరిగిన ఉత్తర నియోజకవర్గ పార్టీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహ సారథులు, సచివాలయం సిబ్బంది తదితరులతో నాయకులు, కార్యకర్తలు సమన్వయం చేసుకుంటూ పార్టీని బలోపేతం చేసుకోవాలని సూచించారు. పథకాల అమలు తీరు, లోటుపాట్లు గురించి లబ్ధిదారుల నుంచి సమాచారాన్ని తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఉత్తర నియోజకవర్గంలోని 87 సచివాలయాల్లో ముగ్గురు చొప్పున పార్టీ సారథులు నియామకాన్ని పూర్తిచేసిన సమన్వయకర్త కెకె.రాజును సుబ్బారెడ్డి అభినందించారు.

'సింహాచలం' భూ సమస్యకు కృషి

సింహాచలం దేవస్థానం భూసమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని సుబ్బారెడ్డి తెలిపారు. కొన్ని న్యాయపరమైన చిక్కుల వల్ల ఆలస్యమవుతుందన్నారు. ఇళ్ల మరమ్మతుల కోసం కోర్టులో ప్రభుత్వం తరపున పిటిషన్ వేసినట్లు చెప్పారు. సంక్రాంతి నాటికి అనుకూల నిర్ణయం వెలువడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నగరంలోని కొండవాలు ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్, మెట్లు, వీధి దీపాలు వంటి మౌలిక సౌకర్యాల కల్పనకు అధికారులతో చర్చిస్తానన్నారు. పెన్షన్లు, రేషన్ కార్డుల జారీలో నెలకొన్న ఇబ్బందులు తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, నాయకులు రామకృష్ణ, చిక్కాల రామారావు, సతీష్, బాణాల శ్రీనివాస్, కంపా హనోక్ తదితరులు పాల్గొన్నారు.


సుమాకాంత్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజు

సుమాకాంత్‌కు సత్కారం

ప్రజాశక్తి-పెందుర్తి : స్టార్ ఆంధ్రప్రదేశ్ -2022 పేరిట విశాఖ గ్రీన్ పార్కులో క్లాసిక్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో అందాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో చిన్నముసిడివాడ ప్రాంతానికి చెందిన యువతి పూజారి సుమాకాంత్ మిస్ ఆంధ్ర అందాల పోటీలలో ద్వితీయ స్థానం సంపాదించారు. ఈ సందర్భంగా సుమాకంత్‌ను పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు రాంపురం గ్రామంలోని క్యాంప్ ఆఫీసులో సత్కరించారు.

తాగి వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి -కంచరపాలెం : మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని కంచరపాలెం ట్రాఫిక్ సిఐ మళ్ల అప్పారావు హెచ్చరించారు. కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధి ఎన్ఎడి జంక్షన్, కరాస, బిఆర్‌టిఎస్ రహదారి తదితర ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. బర్మా జంక్షన్‌లో ఎస్ఐ పాపారావు ఆధ్వర్యాన డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు.


డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసులు

పాఠశాలల్లో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలోని పలు పాఠశాలల్లో శనివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

గాజువాక: అగనంపూడి పరిధి కొండయ్యవలసలోని శ్రీ విజ్ఞాన్ బ్రిలియంట్ స్కూల్లో ప్రిన్సిపల్ కె.పద్మావతి ఆధ్వర్యాన క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కెవి.సత్యనారాయణ, ఆర్గనైజర్ జి.రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రవీంద్ర ఇండియన్ పబ్లిక్ స్కూల్లో...

రవీంద్ర ఇండియన్ పబ్లిక్ స్కూల్లో క్రిస్మస్ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ఎస్‌వికె పరుశురాం పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక సన్ స్కూల్లో క్రీస్తు జననం నాటిక, నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలను విద్యార్థులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కెవి.బాలామణి, పాఠశాల డైరెక్టర్ కె.శ్రీనివాస్, ఫాస్టర్ టి.సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ములగాడ : స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాల ఆధ్వర్యాన క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. ఏసుక్రీస్తు జననంపై



శ్రీవికాస్ పాఠశాలలో వివిధ వేషధారణలో విద్యార్థులు

విద్యార్థినిలు ప్రదర్శించిన నాటిక, శాంతాక్లాజ్ సందడి ఆహూతులను ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ఫాదర్ ప్రదీప్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, సిస్టర్స్, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

శ్రీవికాస్ పాఠశాలలో క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. క్రీస్తు పుట్టుకను విద్యార్థులు నాటిక రూపంలో ప్రదర్శించారు. క్రిస్మస్ ట్రీని వివిధ రకాల బహుమతులతో అలంకరించారు. చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ యు.రాధిక, కరస్పాండెంట్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వస్తు, సేవల్లో లోపాలపై ప్రశ్నించాలి

తూనికలు, కొలతలు శాఖ అసిస్టెంట్ కమిషనర్ రంగారెడ్డి

ప్రజాశక్తి-అనకాపల్లి

వస్తు, సేవల్లో లోపాలపై ప్రశ్నించాలని తూనికలు కొలతలు శాఖ అసిస్టెంట్ కమిషనర్ పి.వి.రంగారెడ్డి సూచించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శనివారం తూనికల్లో తేడాలు, కొలతల్లో మోసాలు, వినియోగదారుల రక్షణ చట్టం తదితర అంశాలపై పాలిటెక్నిక్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రంగారెడ్డి మాట్లాడుతూ ఎంఆర్‌పి ధరల కంటే ఎక్కువకు విక్రయించడం, తూకాల్లో అరిగిపోయిన రాళ్లను వినియోగించడం, డిజిటల్ తూనిక యంత్రాల్లో తప్పుగా నమోదు చేయడం, నికర బరువు కన్నా తక్కువ ఉండడం అనే అంశాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్యాకేజీ లేబుల్‌పై గరిష్ట ధర, ఫోన్ నెంబర్, ఇ-మెయిల్ అడ్రస్ ఉండాలన్నారు. రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో వినియోగదారుల హక్కుల రక్షణపై విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఐవిఎస్‌ఎస్ శ్రీనివాసరావు, కన్జ్యూమర్ రైట్స్ సేఫ్ గార్డింగ్ సొసైటీ అధ్యక్షులు రెడ్డి సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కొలతల్లో మోసాలు గుర్తించాలి : డిఎస్‌ఒ ప్రసాద్

కొలతలు నాణ్యతలో జరిగే మోసాలను గుర్తించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి కెవిఎస్‌ఎం ప్రసాద్ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికారులతో పాటు కార్యకర్తలు కొనుగోలుదారులకు జరిగే మోసాల పట్ల నిఘా పెట్టాలన్నారు. అనంతరం వినియోగదారుల ఫోరం నాయకులను పౌర సరఫరాల శాఖ సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఫోరం నాయకులు ఎ.వి.రమణయ్య, సత్యనారాయణ, ఏఎస్‌ఓ కళ్యాణి, సిఎస్‌డిటిలు అప్పలనాయుడు, రాజేశ్వరి, లీల, చందన, రేఖ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తూనికలు, కొలతలు అసిస్టెంట్ కమిషనర్ రంగారెడ్డి


ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న డిపిఒ శిరీషరాణి

జగనన్న కాలనీల బిల్లులు పెండింగ్ లేవు

- డిపిఒ శిరీష రాణి

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట, వడ్డాది

జగనన్న హౌసింగ్ కాలనీలలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బిల్లులు పెండింగ్ లేవని జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి అన్నారు. బుచ్చియ్యపేట, వడ్డాది గ్రామాల్లో జగనన్న ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు నిర్మాణాలను ప్రారంభించని వారు వెంటనే ప్రారంభించాలన్నారు. నిర్దేశిత స్టేజులవారీగా నిర్మాణాలు పూర్తయిన వెంటనే ఆన్‌లైన్ చేసి బిల్లులు విడుదల చేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులకు అవగాహన పెంచి నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ గోపీనాథ్, పంచాయతీ సెక్రెటరీ ఎం.లోవరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బి.భవాని పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు, విత్తన సరఫరాపై జాగ్రత్తలు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో ధాన్యం కొనుగోలు, విత్తన సరఫరాపై అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి వ్యవసాయ, వివిధ అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్, పిఎం కిసాన్, ఈకేవైసీపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఉద్యానవన శాఖ మైక్రో ఇరిగేషన్ పురోగతిపై సమీక్షించారు. సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను మే నెల వరకు పొడిగించాలని, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. మంచు వల్ల జీడి మామిడి తోటలో జరిగే నష్ట నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెసి కల్పన కుమారి, అసిస్టెంట్ కలెక్టర్ దాత్రిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్‌రావు, పశుసంవర్థక శాఖ, ఆత్మ, పౌరసరఫరాల శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సిడిపిఓ లతాశ్రీ తెలిపారు. శనివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కశింకోట మండలం కన్నిబు పాలెంలో అంగన్వాడీ కార్యకర్త, గొబ్బూరు, పేరంటాలపాలెం, నర్సాపురం గ్రామాల్లో ఆయా పోస్టులు, అనకాపల్లి మండలం సీతానగర-2లో అంగన్వాడీ కార్యకర్త, మాకవరం, భూపతి పాలెం, సుందరయ్య పేటలో ఆయా పోస్టులు, మునగపాక మండలం అరబుపాలెం, గణపర్తి-1, చూచుకొండ-2, ఒంపోలులో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు జనవరి 5లోపు దరఖాస్తు చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు కశింకోట ప్రాజెక్ట్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

పైపులైన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని మేజర్ పంచాయతీ తుమ్మపాల శివాలయం వద్ద పైపులైన్ మరమ్మతు పనులను శనివారం సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు పరిశీలించారు. ఈ పైపులైన్ మరమ్మతులకు గురి కావడంతో డ్రైనేజీ వాటర్ పైపులైన్ ద్వారా ప్రవహించడంతో నీరు కలుషితమై ప్రజలు, పశువులు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ దృష్టికి స్థానికులు తీసుకువెళ్లడంతో ఆయన సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడుకు తెలియజేసి మరమ్మతులు చేపట్టాలని కోరారు. తక్షణమే ఆయన స్పందించి మరమ్మతు పనులను పూర్తిచేసి స్థానికుల ఇబ్బందులను పరిష్కరించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ పిడి గాంధీ, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్య కుమారి చంద్రశేఖర్, బిఎస్‌ఎన్‌ఎల్ అడ్వైజర్ కమిటీ మెంబర్ పీలా విశ్వేశ్వరరావు, రైతు సంఘం నాయకులు పీలా బుజ్జి పాల్గొన్నారు.


నడక పోటీలో పాల్గొన్న వాకర్స్

గొర్లివానిపాలెంలో నడక పోటీలు

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని గొర్లివానిపాలెం పంచాయతీ పరిధి ఆర్కే లేఅవుట్‌లో ప్రతిరోజు ఉదయం వాకింగ్ చేసే వారికి శనివారం ఉదయం నడక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను గ్రామ సర్పంచ్ గొర్లి గోపి అమ్ములు ప్రారంభించారు. ఈ పోటీల్లో సుమారు 40 మంది పాల్గొన్నారు. వీరిలో దిబ్బలగొర్లివాని పాలెం గ్రామానికి చెందిన పైల రమణబాబు ప్రథమ స్థానంలోనూ పరవాడ గ్రామానికి చెందిన ఆర్‌ఆర్.నాయుడు ద్వితీయ స్థానంలోనూ నిలిచారు. గెలుపొందిన వారికి సర్పంచి గొర్లి గోపి అమ్ములు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గొర్లి అప్పలనాయుడు, పైలా సూరిబాబు, వద్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు డైట్ విద్యార్థిని అలేఖ్య ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి



అఖిలభారత అంతర్ విశ్వవిద్యాలయ ఖోఖో పోటీలకు డైట్ కళాశాల విద్యార్థిని బి.అలేఖ్య ఎంపికయ్యారు. విజయనగరం జెఎన్‌టియు జీవీలో ఈ నెల 23న జరిగిన జిల్లా స్థాయి ఎంపికలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి 80 మంది పాల్గొన్నారు. వీరిలో రాష్ట్రస్థాయికి అలేఖ్య ఎంపికైంది. బెంగళూరు ఏలియన్స్ కళాశాలలో జనవరి 23 నుంచి 26 వరకు జరిగే పోటీల్లో ఆమె పాల్గొంటారని కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్, ఫిజికల్ డైరెక్టర్ బి శ్రీనివాసరావు తెలిపారు.

వైసిపి పాలనలో వ్యవసాయ రంగం నిర్వీర్యం

- మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

ప్రజాశక్తి -అనకాపల్లి

వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైసిపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తుందని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ విమర్శించారు. ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవడంలో విఫలమైందన్నారు. వైసిపి ప్రభుత్వం చేస్తున్న అవినీతికి వ్యతిరేకంగా కలిసి పోరాడేందుకు 9261292612 నెంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు బిఎస్‌ఎంకె జోగినాయుడు, కార్యదర్శి పోలవరపు త్రినాథ్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సబ్బవరపు గణేష్, ఎస్ రామకృష్ణ, ఆళ్ల జగన్, కాండ్రేగుల చిన్న, ఆకుల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

అధికారులకు ఓటర్ల జాబితా పరిశీలకులు భాస్కర్ ఆదేశం


మాట్లాడుతున్న భాస్కర్, చిత్రంలో కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

2023 జనవరి 3వ తేదీ నాటికి ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఓటర్ల జాబితా పరిశీలకులు పి.భాస్కర్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్ల మార్పులు చేర్పులు, తొలగింపులు పూర్తి చేయాలన్నారు. బూత్ స్థాయి అధికారులు సమర్పించిన రికార్డులను చూడాలని, ఓటర్లలో స్త్రీ పురుష నిష్పత్తి, ఓటర్ల నిష్పత్తి రాష్ట్రస్థాయి నిష్పత్తికి సమానంగా ఉండాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పఠాన్ శెట్టి మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన కొత్త ఓటర్లు సుమారు 15 వేల వరకు వచ్చాయని, తొలగింపులు 10 వేల వరకు ఉన్నాయని తెలిపారు. ఫారం-7 క్లైములు 1208 కాగా 99 శాతం పూర్తి అయ్యేయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ, నర్సీపట్నం ఆర్‌డిఒ, జిల్లాలోని నియోజకవర్గాల ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

సూక్ష్మ, ఆహార శుద్ధి పరిశ్రమలకు ప్రాధాన్యత

-బ్యాంకులు రుణ లక్ష్యాలను అధిగమించాలి
-జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలోని బ్యాంకులు తమ రుణ లక్ష్యాలను అధిగమించాలని, సూక్ష్మ, ఆహార శుద్ధి పరిశ్రమలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన డిసిసి, డిఎల్‌ఆర్‌సి సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ ప్రాంతం ఎక్కువగా ఉన్నందున చిన్న పరిశ్రమల ద్వారా ఎక్కువ మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. చిన్న చిన్న కారణాలతో దరఖాస్తులను తిరస్కరించకుండా వీలైనంతవరకు మంజూరు చేయాలని సూచించారు. అనంతరం అనకాపల్లి జిల్లా పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ 2023-24 పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, డిఆర్‌డిఎ పిడి లక్ష్మీపతి, మత్స్యశాఖ డిడి లక్ష్మణరావు, ఉద్యానవన శాఖ ఎడి ప్రభాకర్ రావు, యూపీబ రీజనల్ అధికారి నటరాజ్, ఆర్‌బిఐ ప్రతినిధి హనుమ కుమారి, లీడ్ బ్యాంకు మేనేజర్ కె.సత్యనారాయణ, నాబార్డ్ డెవలప్మెంట్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని బంగారంపాలెం రైతు భరోసా కేంద్రంలో 65 మంది రైతులకు రాయితీపై వేరుశనగ విత్తనాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ మాట్లాడుతూ ఎక్కువ మొత్తంలో విత్తనాలను ఏపీ సీడ్స్ ద్వారా తెప్పించి రైతులకు పంపిణీ చేయడం జరిగిందని చెప్పారు. విత్తనాలు నాటిన వెంటనే చీడ పీడల నుంచి సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు, మండల వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ సూరిశెట్టి పార్వతి రాము, దొడ్డి వెంకటరమణ, కోరుబిల్లి నూకరాజు, దొడ్డి కన్నం నాయుడు, దాడి శ్రీను, దొడ్డి సోమేశ్వరరావు, సెక్రటరీ మౌనిక, సత్యనారాయణ, వివిఎ ప్రభావతి రైతులు పాల్గొన్నారు.


వేరుశనగ విత్తనాలు పంపిణీ వ్యవసాయాధికారులు

కశింకోట-బంగారుమెట్ట రోడ్డు విస్తరణకు మోక్షం



రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న దృశ్యం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

కశింకోట-బంగారుమెట్ట రోడ్డు విస్తరణకు మోక్షం కలిగింది. రెండు రోజుల క్రితం మండలంలోని నీలకంఠాపురం గ్రామం వద్ద రోడ్డు విస్తరించడానికి రహదారికి ఒకవైపు గల రోడ్డు మార్జిన్‌ను తవ్వి పనులు ప్రారంభించారు. కశింకోట నుండి బంగారుమెట్టు జంక్షన్ వరకు 24 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం గత ఏడాది రూ.32 కోట్లు కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరయ్యాయి. రెండు నెలల క్రితం బంగారుమెట్ట జంక్షన్లో స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ రోడ్డు విస్తరణ పనులను లాంచినంగా ప్రారంభించారు. కశింకోట-బంగారుమెట్ట రోడ్డులో సుమారు 13 కిలోమీటర్లు బుచ్చయ్యపేట మండల పరిధిలో ఉంది. ఇప్పుడు మండల పరిధిలోని రహదారి విస్తరణ పనులు చేపట్టారు. ఎంతోకాలంగా రోడ్డు విస్తరణ కోసం ఎదురుచూసిన మండల వాసులకు రోడ్డు పనులు ప్రారంభం కావడం ఒకరకంగా సంతోషమని చెప్పాలి. ఈ రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు అనకాపల్లికి రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఈ రహదారిలో ఎక్కువగా మలుపులు ఉండడం, రోడ్డు ఇరుక్కుగా ఉండటంతో వాహనాలు పలుమార్లు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఎట్టకేలకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం కావడంతో మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కూల్చివేసిన గుడి ప్రాంతాన్ని చూపుతున్న గనిశెట్టి సత్యనారాయణ

గుడిని కూల్చివేయడం సరికాదు

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : నిర్మాణం పూర్తయిన దుర్గాలమ్మ గుడిని అధికార పార్టీ నాయకులు దగ్గరుండి రెవెన్యూ అధికారుల చేత కూల్చివేయించడం సరికాదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో కూల్చివేసిన దుర్గాలమ్మ గుడిని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబర్ 300, 301లో అక్రమ నిర్మాణం అంటూ గుడిని కూల్చివేసిన అధికారులు, ముందస్తుగా నోటీసులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. గుడి నిర్మాణం పూర్తయ్యే వరకు నోటీసులు ఇవ్వటంగాని, నిలుపుదల చేయడం గాని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఈ విషయంపై స్థానిక తహశీల్దారును, అధికారులు చేసే కూల్చివేత కార్యక్రమాన్ని దగ్గరుండి నడిపించిన అధికార పార్టీ కార్యకర్తలను అరెస్టు చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

'కాపులకు 5 శాతం రిజర్వేషన్లు తక్షణమే ప్రకటించాలి'

ప్రజాశక్తి- అనకాపల్లి : తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కాపులకు వచ్చిన ఐదు శాతం రిజర్వేషన్లు చట్టబద్ధమేనని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆ రిజర్వేషన్లను ప్రకటించాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సామాజికంగా ఆర్థికంగా వెనుకబడ్డ తరగతులకు రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించేందుకు సొంత జాబితా తయారు చేసుకోవచ్చని కేంద్ర సామాజిక న్యాయ సాధికారత శాఖ సహాయ మంత్రి ప్రతిమ భౌమిక రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారని తెలిపారు. కాపులకు ఇచ్చిన ఐదు శాతం రిజర్వేషన్లను వైసిపి ప్రభుత్వం రద్దు చేయడం అమానుషమన్నారు. దీనివల్ల నాలుగు సంవత్సరాలుగా కాపులకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. నాయకులు కుప్పిలి జగన్మోహన్, శివన్నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-రాంబిల్లి : రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను రాంబిల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు శనివారం ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 8వ తరగతి పిల్లలకు జగనన్న ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేస్తుందని చెప్పారు. రాంబిల్లి మండలానికి 454 ట్యాబులు వచ్చినట్లు తెలిపారు. డిసిసిబి మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ, ఎంపీపీ శిరీష శ్రీను బాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, ఎంఈఓ సూర్యారావు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితురాలికి సాయం

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని శృంగవరం పంచాయితీ శివారు కొత్త భూమి గ్రామంలో కలదుంగా పైడమ్మకు చెందిన పూరిల్లు గోడ ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న టిడిపి మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు పైడమ్మ కుటుంబీకులను శనివారం పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బండారు నరసింహనాయుడు. కన్నూరు సూర్యనారాయణ. సింగంపల్లి స్వామి, పైలా యువసేన నాయకులు పాల్గొన్నారు.


బాధితురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న పైలా ప్రసాదరావు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థులు క్రిస్మస్ ట్రీ, క్రీస్తు జననాన్ని వివరించేల రూపొందించిన కళాకృతులు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా క్రైస్తవ గీతాలను విద్యార్థులు ఆలపించారు. కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైకుంఠరావు, డీన్ అడ్మిన్ డాక్టర్ కెవిఎస్ ఈశ్వరరావు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.


అయ్యన్న స్కూల్లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

అయ్యన్న ఇంగ్లీష్ మీడియం స్కూల్లో..

కె.కోటపాడు : స్థానిక అయ్యన్న ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శనివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రీస్తు జననం తెలిపే పశువుల పాక, దానిలో బొమ్మలు చూపరులను ఆకట్టుకున్నాయి. విద్యుత్ లైట్లతో క్రిస్మస్ ట్రీ ఎంతగానో కనువిందు చేసింది. క్రిస్మస్ తాతలు వేషధారణలో పలువురు చిన్నారులు ప్రాంగణమంతా సందడి చేశారు. దేవదూతల వస్త్రధారణల్లో చిన్నారులు ఏసుక్రీస్తు పాటలకు అనుగుణంగా చేసిన నృత్య ప్రదర్శనలు, జ్ఞానులు, గొర్రెల కాపర్లు వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీం చిన్నారులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అంతరం తల్లిదండ్రుల సమక్షంలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ హరీష్, ఉపాధ్యాయులు సతీష్ సమర్పణ, డేవిడ్, శ్రావణి, పద్మిని, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చర్చలు ముస్తాబు

కశింకోట : ఆదివారం క్రిస్మస్ వేడుకల నేపథ్యంలో మండలంలోని కశింకోట, తాళ్ళపాలెం, కన్నూరుపాలెం, నరిశింగబిల్లి, బయ్యవరం, కొత్తపల్లి తదితర గ్రామాల్లో చర్చలు ముస్తాబయ్యాయి. ఆయా చర్చ పాస్టర్లు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ రకాల సేవలు, ప్రార్థన, భోజనం సదుపాయం, గేయాల ఆలపించేందుకు సిద్ధం చేశారు. చర్చలు రంగులు, ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.

పలుచోట్ల సిపిఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- అనకాపల్లి

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 98వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు శనివారం పట్టణంలోని పలు చోట్ల నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. గుండాల వీధి జంక్షన్లో శ్రీరామదాసు అబ్బులు, విజయరామరాజుపేటలో కోరిబిల్లి శంకర్రావు, గవరపాలెంలో కొమ్మనాపల్లి వెంకటరమణ, వేల్పుల వీధిలో అంబికేశ్వరరావు, ముక్కామల చిన్న పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని మోడీ, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రజా వ్యతిరేక కార్మిక వ్యతిరేక విధానాల వల్ల అవినీతి నిరుద్యోగం, అధిక ధరలు విలయతాండం చేస్తున్నాయని తెలిపారు.

మునగపాక రూరల్ : మండలంలోని నాగులపల్లి గ్రామంలో సిపిఐ 98వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులు నాయుడు మల్లికార్జునరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యవసర వస్తువుల ధరలు పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తున్నాయని విమర్శించారు. కులం, మతం పేరుతో ప్రజలను విడదీస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలను సంఘటితం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెదపాటి శివ అప్పారావు, నాగేశ్వరరావు, ఆనందరావు, రమణ జగదీష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని చోద్యం, లింగంపేటలో సిపిఐ 98వ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా ఆ పార్టీ సీనియర్ నాయకులు పతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ, భారత కమ్యూనిస్టు పార్టీ మన దేశానికి స్వాతంత్ర్యం రాకముందు బ్రిటిష్ పరిపాలనలో ఉన్నప్పుడే 1925 సంవత్సరంలో స్థాపించి పేదల పక్షాన ఉంటూ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. ఎంతోమంది ఉద్యమంలో అమర వీరులు అయ్యారని, వారిని స్మరించుకుంటూ చేసిన త్యాగాలు వృధా చేయకుండా భూ హక్కు కల్పించాలని ఎన్నో పోరాటాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మేకా భాస్కరరావు, కార్యవర్గ సభ్యులు జి.రాధాకృష్ణ, సత్యనారాయణ, బాబులు, నాని, పెదబాబులు, నూకి నాయుడు సత్యనారాయణ, రాంబాబు, బాలరాజు, శాఖ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఆయుర్వేద లేహం పంపిణీ చేస్తున్న సర్పంచ్ తదితరులు

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని జి.భీమవరం గ్రామంలో ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ హనుమంతు వెంకట లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. కరోనా వైరస్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఆయుర్వేద లేహ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కన్నూరుపాలెం ఆయుర్వేద వైద్యాధికారి కోనాడ లావణ్య, సిబ్బంది శివ , యోగా శిక్షకుడు పి.సన్యాసి నాయుడు, అంగన్వాడీ కార్యకర్త శ్రీదేవి, ఆశా కార్యకర్త, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక కుంచవారి గౌరీ పరమేశ్వరుల మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. గౌరీ పరమేశ్వరులను దర్శించుకోవడానికి ఉదయం నుంచే భక్తులు క్యూ కట్టారు. గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న ప్రముఖుల్లో మాజీమంత్రులు గంటా శ్రీనివాసరావు, దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే పీల గోవింద సత్యనారాయణ, కార్పొరేటర్లు కొణతాల నీలిమ భాస్కరరావు, పీలా లక్ష్మి సౌజన్య రాంబాబు, మందపాటి సునీత, జానకి రామరాజు, జివిఎంసి జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ పలక యశోద, వైసిపి నాయకులు దాడి రత్నాకర్, పలక రవి తదితరులు ఉన్నారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతించి ప్రత్యేక పూజలు నిర్వహించి దుస్సాలులతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పాండ్రంకి సత్యారావు, సభ్యులు కోరుకొండ సాంబశివరావు, పాలూరి శ్రీనివాసరావు, అబ్బులు, కొమోజు రామకృష్ణ, ధవలేశ్వరం రాంబాబు, వాడపల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే రాజు


ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

మండలంలోని పోలేపల్లిలో గౌరీ పరమేశ్వరులను చోడవరం మాజీ శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్.రాజు, టిడిపి మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, నాయకులు దుంకిని అప్పలనాయుడు తదితరులు దర్శించుకున్నారు. శనివారం గౌరీ పరమేశ్వరుల ఉత్సవం సందర్భంగా గ్రామస్తులు ఉదయం నుండి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఎడ్ల పందెం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కృష్ణమ్మకు నివాళి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఇటీవల మృతి చెందిన మండలంలోని రాజానపాలెం గ్రామానికి చెందిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్ తల్లి రాజాన కృష్ణమ్మ సంతాప సభ శనివారం జరిగింది. ఎలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు, డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ, జెడ్పి మాజీ చైర్పర్సన్ లాలం భవాని తదితరులు కృష్ణమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణమ్మ కుటుంబీకులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు లాలం భాస్కరరావు, పంచకర్ల ప్రసాద్, రాజాన గోపి, వైసిపి మండల అధ్యక్షులు దేశంశెట్టి శంకర్రావు, నాయకులు కోన బుజ్జి, రాజన్న అప్పారావు, రాజన్న నానాజీ పిన్నమరాజు వాసు, రాజకీయాలకు అతీతంగా పలువురు పాల్గొని సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా అన్న సంతర్పణ నిర్వహించారు.


కృష్ణమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

దాతలూ..ఆదుకోరూ...

-విద్యార్థి గట్రెడ్డి నీరజ్‌కు తీవ్ర రక్తహీనత వ్యాధి
-బోన్ మేరో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు రూ.30 లక్షల ఖర్చు



ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన విద్యార్థి గట్రెడ్డి నీరజ్ (15) తీవ్ర రక్తహీనత వ్యాధితో బాధపడుతున్నాడు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఈ విద్యార్థి గత కొంత కాలంగా ఈ వ్యాధితో ప్రాణా పాయ స్థితిలో ఉన్నాడు. విద్యార్థి నీరజ్‌ను తల్లి దండ్రులు శ్రీను, నాగమణి హైదరాబాద్‌లో నిజాం ఆసుపత్రిలో చికిత్స కోసం తరలించారు. అక్కడి వైద్యులు విద్యార్థికి బోన్ మేరో ట్రాన్స్ ప్లాంటేషన్ చేయాల్సి వస్తుందని, అందుకు సుమారు రూ.30 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. ఇప్పటికే విద్యార్థి తల్లిదండ్రులు తమ వద్ద ఉన్న కొంత మొత్తాన్ని ఖర్చు చేసి వైద్యం అందిస్తున్నారు. ఈ నిరుపేద కుటుంబంలో వచ్చిన ఈ కష్టానికి పలువురు ఆవేదన వ్యక్తం చేస్తుండగా మరి కొంతమంది తమకు తోచిన సాయాన్ని అందజేస్తున్నారు. సాటి విద్యార్థి ప్రాణాపాయ స్థితిలో ఉండడంతో కొత్తకోట పాఠశాల విద్యార్థులతో పాటు పలు పాఠశాల విద్యార్థులు కూడా సాయం అందించేందుకు ముందుకు వస్తున్నారు. విద్యార్థి నీరజ్ ను ఆదుకునేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని తల్లిదండ్రులు కోరారు. సాయం అందించే దాతలు విద్యార్థి తల్లి గట్రెడ్డి నాగమణి పేరున ఎస్‌బిఐ అకౌంట్ నెంబర్ 30329345882, ఐఎఫ్‌సి కోడ్ ఎస్‌బిఐఎన్ 0002748 కొత్తకోట బ్రాంచ్ లేదా 7660078730 ఫోన్ పేకు సాయం అందించాల్సిందిగా కోరారు.

బిసి సంఘం ఉపాధ్యక్షునిగా నరేష్



ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలోని బికెపల్లి గ్రామానికి చెందిన పెట్ల నరేష్ ఉత్తరాంధ్ర బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. వెలమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు శనివారం పెట్ల నరేష్‌కు నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా నరేష్‌కు పలువురు వెలమ సంఘ సభ్యులు, నాయకులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెలమ సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానన్నారు.




పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కోవిడ్ పరీక్షలు

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:మండలంలోని కొరుప్రోలు గ్రామంలో కోవిడ్ టెస్టులు చేపట్టినట్లు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అధికారిని ఆశా తెలిపారు. గత రెండు రోజులుగా కరోనా వ్యాప్తిపై వస్తున్న వార్తల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేపట్టినట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతానికి 20 ర్యాపిడ్ కిట్లను కేటాయించారని, ఎవరికైనా కోవిడ్ లక్షణాలు ఉన్నట్లుగా అనిపిస్తే నేరుగా కేంద్రం వద్ద సంప్రదించాలని ఆమె తెలిపారు. ప్రతీ ఒక్కరు విధిగా మాస్క్ ధరించాలని, ఎప్పటికప్పుడు శానిటైజ్ చేసుకోవాలని సూచించారు.ఈ రెండు రోజుల్లో ఐదుగురికి టెస్టులు నిర్వహించామని, అన్ని నెగెటివ్ వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం లక్ష్మి, ఆశా కార్యకర్త సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల్లో స్టేషన్ బెయిల్ రద్దు చేయాలి



ప్రజాశక్తి -నర్సీపట్నంరూరల్:ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో స్టేషన్ బెయిల్ రద్దు చేయాలని రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు య రంశెట్టి పాపారావు డిమాండ్ చేశారు. శనివారం నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామంలో ఆయన మాట్లాడారు. ఇటువంటి కేసుల్లో 41 నోటీసులు ఇచ్చి స్టేషన్ బెయిల్ ఇవ్వడం సరైంది కాదన్నారు. ఎఫ్ఎస్ఐఆర్ నమోదు చేసిన 24 గంటల్లో అట్రాసిటీ కేసులో నిందితులను అరెస్టు చేయాలనే సుప్రీంకోర్టు ఆదేశాలను తుంగలో తొక్కుతున్నారన్నారు. చట్టాలను చుట్టాలుగా మార్చడంతోనే ఎస్సీ, ఎస్టీలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు అధికమవుతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీల కోసం కఠినమైన ప్రత్యేక చట్టాలు, కోర్టులు, కమీషన్లు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కాలేదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను అమలు చేయని అధికారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోక పోవడంతోనే చట్టాలు దుర్వినియోగం అవుతున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు యర్రంశెట్టి పెదరాజు, వడ్డాది అప్పలనాయుడు, రా జు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులతో క్రీడాకారులు

క్రీడాకారులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్:భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం, శ్రీ వేమ యువజన సేవా సంఘం (వేములపూడి) ఆధ్వర్యంలో 2022 బ్లాక్ స్థాయి క్రీడా పోటీలు నర్సీపట్నంలో బైపాస్ రోడ్డు వద్ద క్రీడా ప్రాంగణంలో ఈ నెల 18 నుంచి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్ వంటి క్రీడలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి శనివారం షీల్డ్, సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ వేమ యువజన సేవ సంఘం ప్రధాన కార్యదర్శి బోలెం శివ మాట్లాడుతూ, గ్రామీణ యువతలో ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి జి ల్లా స్థాయి పోటీలకు ఎంపికలో భాగంగా ఈ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. క్రీడలతో యువకులకు ఉద్యోగ అవకాశాలతో పాటు మానసిక ధైర్యం, శారీరక దారుఢ్యం పెరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో సాయి రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ సెక్రెటరీ సాయి, దక్షా వెల్ఫేర్ సొసైటీ సెక్రెటరీ అడిగర్ల సతీష్, ప్రెసిడెంట్ వెలగ జగన్నాథ్, స్పోర్ట్స్ ట్రైనర్ హరి, నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్లు సత్యసాయి, ఎం.గౌరీశంకర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -మాకవరపాలెం:ప్రభుత్వం ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం ద్వారా రైతులు ఎంతో లాభపడు తున్నారని ఎంపీపీ రుతుల సత్యనారాయణ అన్నారు. శనివారం తామరం పిఎసిఎస్ బ్యాంకు వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, తడిసిన ధాన్యం ను కూడా అధికారులు కొనుగోలు చేస్తారన్నారు. ఇకపై రైతులు అందరూ ధాన్యంను కేంద్రాల వద్ద అమ్ముకాలు జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, మండల వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు వాసు, వ్యవసాయ అధికారి చిరంజీవి, బ్యాంకు సీఈఓ కన్నా అప్పారావు, గొంతిన హరిబాబు, భద్రాచలం, సర్పంచ్. బొడ్డు. గోవింద పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎంపిపి



స్థలాన్ని పరిశీలన చేస్తున్న జెడి

జెట్టీ నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని రాజయ్యపేట సముద్ర తీరంలో జెట్టి నిర్మాణానికి శనివారం మత్స్యశాఖ జెడి లక్ష్మణరావు స్థల పరిశీలన చేశారు. జెట్టి నిర్మాణానికి 6 ఎకరాల స్థలం అవసరం ఉంటుందని అన్నారు. జెడ్‌పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, సర్పంచ్ తనయుడు పిక్కి కామేశ్వరరావు, మత్స్యకార నాయకులు పిక్కి కోదండరావు, పిక్కి సత్తయ్య తదితరులు అధికారులతో మాట్లాడారు. రాజయ్యపేట తీరంలో జెట్టి ఏర్పాటు చేయాలని కోరారు. స్థల సేకరణ కు సంబంధించిన నివేదికను కలెక్టర్ కు నివేదిస్తా మన్నారు. రాజయ్యపేట శివారు బోయపాడు తీరంలో కూడా జెట్టి నిర్మాణం కు గతంలో అధికారులు స్థల పరిశీలన చేశారు.ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఎడి విజయ్ కృష్ణ ,రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే ధర్మశ్రీ పర్యటన

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలో వి.శరభవరం గ్రామ శివారు లోసింగి, పిత్రిగెడ్డ, పెదగరువు, గుర్రాలబైల, గడబపాలెం గ్రామాల్లో చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. వైబి.పట్నం నుంచి లోసింగి వరకు నాలుగు కిలో మీటర్ల దూరం వెళ్లారు. కనీసం రోడ్డు సౌకర్యం లేదు. కనీసం బైక్ కూడా వెళ్లని పరిస్థితి. దీంతో ఎమ్మెల్యే గుర్రంపై లోసింగి గ్రామానికి చేరుకున్నారు. అనంతరం ఏజెన్సీ ప్రాంతం కొండపైన ఉన్న వారిని గడపగడపకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని, అంగన్వాడీ కేంద్రం కూడా లేదని ఎమ్మెల్యే ముందు వాపోయారు. దీంతో ఎమ్మెల్యే త్వరలోనే రోడ్డు నిర్మాణం, అంగన్వాడీ కేంద్రాన్ని మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. లోసంగి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం అర్ల పంచాయతీలో పర్యటించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన నియోజకవర్గంలో ఉన్న మారుమూల ప్రాంతాలను సైతం అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ ప్రభాకర్‌రావు, ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు మడ్డు అప్పలనాయుడు, మండల ఉపాధ్యక్షులు రాజు, అర్ల పంచాయతీ సర్పంచ్ వంజరపు పాల్గొన్నారు.



గుర్రంపై వెళుతున్న ధర్మశ్రీ

ఆకట్టుకున్న సంకీర్తనలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కొంకసింగి భజన మండలి రెండవ దత్తత గ్రామమైన రామచంద్రపురం గ్రామంలో గ్రామ సంకీర్తన ఆకట్టుకున్నాయి. అనంతరం ఐదుగురు వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎల్‌పురం, పాతకేడిపేట, కొంకసింగి భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

యస్.రాయవరం:మండలంలోని కొరుప్రోలు గ్రామంలో సీతారామ ఆలయంలో అర్చకులు సుదర్శనం నారాయణాచార్యులు, గురుస్వామి సత్యనారాయణ (గాంధీ) ఆధ్వర్యంలో నగర సంకీర్తన చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు నారాయణా చార్యులు మాట్లాడుతూ, ధనుర్మాసంలో సీతారాముల పూజోత్సవంతో పాటుగా వెంకటేశ్వర స్వామికి వేకువజామున అభిషేకం, అర్చన నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఆలయంలో సీతారామ భజన మండలి ఆధ్వర్యాన గీతాలు ఆలపించారు.ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు ముత్తా గోవిందరావు, సూరిబాబు, రాము, సతీష్, అప్పన్న, సత్యన్నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న తిరువీధి సేవ

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు శనివారం ఇత్తడి గరుడ వాహనంపై శ్రీనివాసుడుని ఊరేగించారు. అర్చక బృందం గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, సంకర్షణపల్లి రాజగోపాల కృష్ణమాచార్యులు, భాగవతం గోపాలాచార్యులు ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామిని ఇత్తడి గరుడ వాహనం, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో తిరువీధి సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

విద్యా రంగంపై ప్రత్యేక శ్రద్ధ

గొలుగొండ జెడ్‌పిటిసి గిరిబాబు

ప్రజాశక్తి -గొలుగొండ:ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు అన్నారు. శనివారం గొలుగొండ మండలం చీడిగుమ్మల జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు 63 మందికి ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల విద్య పట్ల పేద కుటుంబాల ఎదుగుదల పట్ల ఆయన చిత్తశుద్ధి కనపరుస్తున్నారన్నారు. ఎన్నికల హామీలలో అమ్మఒడి ఒక్కటే వాగ్దానం చేసిన సీఎం నాడు నేడుతో పాటు విద్యార్థులకు యూనిఫాం, నాణ్యమైన కిట్లు పంపిణీ చేశారన్నారు.. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్నబ్బాయి, హెచ్ఎం నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు..



ట్యాబును పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి గిరిబాబు



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

అర్హులకు ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. మండలంలోని పెదగుమ్ములూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతీ ఒక్కరికి పక్కా ఇళ్ళు మంజూరు చేశామని, అమ్మ ఒడి, రైతు భరోసా వంటి పథకాలు ప్రవేశపెట్టామని తెలిపారు. అర్హత ఉండి పథకాలు పొందని వారు ఎవరైనా ఉంటే నేరుగా తనని సంప్రదించవచ్చని, సత్వర న్యాయం చేకూరుస్తానని తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో కుల మతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు వర్తింప చేస్తున్నామని తెలిపారు.స్థానిక మహిళలను కలుసుకుని వైసీపీ ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీను రాజు, కిరణ్, బాబ్జి రాజు, లోవరాజు, రాజా రమేష్, శ్రీను, రాజు, చంటి, పార్టీ నాయకులు, స్థానిక అధికారులు, సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నకు మతి ఉందా..

సిఎం పర్యటనను అడ్డుకోవడం ఏంటి ?

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తుగ్లక్‌లా మతిభ్రమించి మాట్లాడు తున్నారని స్థానిక ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ మీడియాకు పంపిన వీడియోలో విమర్శిం చారు. ఈనెల 28న నర్సీపట్నం సీఎం జగన్మోహన్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేందుకు వస్తున్న సమయంలో సీఎంను అడ్డుకుంటామని అయ్యన్న పాత్రుడు పిచ్చి తుగ్లక్‌గా మాట్లాడటం తగదన్నారు. రైతులను మోసం చేసిన మీకు రైతు గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. 2014 అధికారంలోకి వచ్చేందుకు ఎన్నో అడ్డదారులు రైతులకు భేషరతుగా రైతు రుణాలు మాఫీ చేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్, ఇంట్లో ఒకరికే రుణమాఫీ, లక్ష యాభై వేలు మాఫీ చేస్తానని, ఐదు తపాలాగా చేస్తానని నమ్మబలికి ఆఖరికి రైతుల నోట్లో మట్టి కొట్టి మోసం చేశారని అన్నారు. రైతులను మోసం చేసిన చంద్రబాబుకు, అయ్యన్నపాత్రుడుకు జగన్మోహన్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఆనాడు రైతులను మోసం చేసి అధికారం పొందారే తప్ప ఏమి ఉద్ధరించారన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి నర్సీపట్నం వస్తున్నప్పుడు అడ్డుకుంటే అక్కడే తొక్కి పడేస్తామని హెచ్చరించారు. సీఎం సభను చూసేందుకు సంక్షేమ పథకాలు అందుకుంటున్న మహిళలు ఎంతో ఉత్సాహంతో ఉన్నారని పార్టీ నాయకులు సీఎం సభ ఏర్పాట్లను జోరుగా సాగిస్తున్నారని అన్నారు.

పెన్సిల్‌పై క్రిస్మస్ ట్రీ

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గ్రహీత, సూక్ష్మ కళాకారుడు గట్టెం వెంకటేష్ తన సూక్ష్మ కళతో పెన్సిల్ ముళ్ళపై క్రిస్మస్ ట్రీ, స్టార్ చెక్కి తన ప్రతిభను చాటుకున్నాడు. ఆదివారం క్రిస్మస్ సందర్భంగా పెన్సిల్ ముళ్ళపై క్రిస్మస్ ట్రీ, స్టార్ చెక్కి అందరినీ అబ్బుర పరిచాడు. క్రిస్మస్ సందర్భంగా తన సూక్ష్మ కళతో క్రిస్టియన్ సోదరులకు శుభాకాంక్షలు తెలియజేసాడు.



క్రిస్మస్ ట్రీ

వేతనాలు చెల్లించాలని
ఏటికొప్పాక సుగర్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- ఎస్.రాయవరం: వేతనాలు చెల్లించకపోతే ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటామని ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు హెచ్చరించారు. ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులకు గత 3 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రూ.8 కోట్లు బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ, గత 3 సంవత్సరాలుగా చెల్లించాల్సిన పెండింగ్ బకాయి వేతనాలు 8 కోట్లు రావాల్సి ఉందని, ఎన్నిసార్లు విన్నపాలు ఇచ్చినా అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. జీతాలు చెల్లించాలని, లేని పక్షంలో ఈనెల 28న అనకాపల్లి జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రిని అడ్డుకుంటామని తెలిపారు. 3 సంవత్సరాలుగా జీతాలు చెల్లించలేదని, గత 2 సంవత్సరాలుగా ఫ్యాక్టరీని మూసివేయడం జరిగిందని, దీంతో ప్రస్తుతంతో జీవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే షుగర్ ఫ్యాక్టరీ లను ఆధునీకరిస్తామని హామీ ఇచ్చారని, మూడున్నర సంవత్సరాలు అవుతున్నా నేటికీ షుగర్ ఫ్యాక్టరీ లను ఆదుకోలేదని తెలిపారు. పైగా కష్టించి పని చేసిన వారికి కూడా వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని, షుగర్ ఫ్యాక్టరీని తెరిపించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు, కార్మిక సంఘం నాయకులు కె.సత్యనారాయణ జీ.గోవిందరావు ఎం.సూర్యారావు ఆర్.హనుమంతురావు, రాజు, కె.రమణ, పి.గోవింద్, ఏ.నారాయణమూర్తి, పి.వెంకన్న, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.త్రినాధరావు, జిల్లా కమిటీ సభ్యులు కె.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న సంఘాల నాయకులు, కార్మికులు

వేగంగా గృహాలు నిర్మించాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని పెదదొడ్డిగల్లు, గుల్లిపాడు గ్రామాల్లో శనివారం జగనన్న లేఅవుట్ లను ఎంపీడీవో సీతారామరాజు, హౌసింగ్ అధికారులు సందర్శించారు. గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. వేగవంతం గా గృహ నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. ఇంకా గృహ నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి అవగాహన కల్పించారు. త్వరగతిన నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. ఇప్పటికే చాలా ఆలస్యమైందని, ఇకపై అలా జరగడానికి వీలులేదన్నారు. లేఅవుట్ లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని లబ్దిదారులు గృహ నిర్మాణాలు నిర్మించుకోవడానికి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ లు తదితరులు పాల్గొన్నారు .



పరిశీలిస్తున్న అధికారులు

సిఎం బహిరంగ సభకు ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:నర్సీపట్నం నియోజక వర్గంలో ఈనెల 28న సుమారు రూ.1000 కోట్లతో నిర్మించే ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో నర్సీపట్నంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు గాను ముమ్మరంగా ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా స్థానిక బలిఘట్టం బైపాస్ రోడ్‌లో హెలీ ప్యాడ్ నిర్మించారు. పెద్దబొడ్డేపల్లి జోగు నాదుని పాలెం వద్ద బహిరంగ సభకు ఏర్పాటు చేశారు. హెలిప్యాడ్ నుండి బహిరంగ సభ వరకు సీఎం జగన్మోహన్ రెడ్డి రోడ్ షో నిర్వహిస్తారని పార్టీ వర్గాలు తెలియజేశాయి. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి అమర్నాథ్, జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి ఆదేశాల మేరకు రోడ్ షోకు అనుకూలంగా ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ ఆధ్వర్యంలో నిరంతరం పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. ఈనెల 28న ఉదయం 11 గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తామని అధికార వర్గాలు తెలియజేశాయి. ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖ అధికారులు రోడ్ కు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చుతూ అడ్డంగా ఉన్న చెట్లను నరికివేశారు. ఎన్నికల వేడి సమీపిస్తున్న తరుణంలో జగన్మోహన్ రెడ్డి నర్సీపట్నం రావడం ఇది రెండోసారి.

మొక్కలు తొలగింపు

నర్సీపట్నం టౌన్: సీఎం సభ పుణ్యమా అని నర్సీపట్నం లో ఏపుగా ఎదిగిన చెట్లను నేలమట్టం చేస్తున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాలన్న అధికారులే నర్సీపట్నంలో ఏపుగా ఎదిగిన మొక్కలను నేలమట్టం చేశారు. జగనన్న పచ్చతోరణం, వనమహోత్సవం పేరుతో స్వయాత్తు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.మొక్కలు నాటే కార్యక్రమం ఓ యజ్ఞంలా చేపట్టాలని కూడా తెలియజేశారు. నాయుడుపేటలో ఎన్నో ఏళ్లుగా ఎదుగుతున్న, హరితహారం పేరుతో నాటిన మొక్కలను నరికి వేశారు. ఎన్నో ఏళ్ల క్రితం ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటారు. సీఎం సభ పేరు చెప్పి ఇలా అక్రమంగా నరికి వేయించడం పలు విమర్శలకు తావిస్తోంది.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేష్

సీఎం బహిరంగ సభకు తరలిరావాలి

ప్రజాశక్తి-గొలుగొండ:ఈ నెల 28న నర్సీపట్నంలో జరిగే సిఎం జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏఎల్‌పురం సర్పంచ్ లోచల సుజాత, ఎంపిటిసి చింతల బుల్లి ప్రసాద్‌లు కోరారు. శనివారం వారు మాట్లాడుతూ సీఎం సభకు భారీ జన సమీకరణ చేస్తున్నామన్నారు. మండలం నుంచి అధిక సంఖ్యలో ప్రజలను సీఎం సభకు తరలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

భోజనం, దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్:జనసేన నాయకులు చక్రవర్తి జన్మదినం సందర్భంగా శనివారం పెద్ద బొడ్డేపల్లిలో నిరాశ్రయుల ఆశ్రమంలో నిరాశ్రయులకు మధ్యాహ్న భోజనం, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చక్రవర్తి కుటుంబీకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకొని ఈ కార్యక్రమాలు చేపట్టామని తెలియజేశారు. రానున్న రోజులలో మరింత ఎక్కువ మందికి సేవ చేయాలని మనస్పూర్తిగా ప్రార్థిస్తున్నామన్నారు, ఈ కార్యక్రమంలో హరి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు హరినాథ్ మరియు మోపాట చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న నాయకులు

క్రిస్మస్ వేడుకలకు చర్చిలు సిద్ధం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : క్రిస్మస్ వేడుకలకు విశాఖ నగరం సిద్ధమైంది. ముఖ్యంగా నగరంలోని చర్చిలు అన్నింటినీ అందంగా అలంకరించారు. విద్యుత్ దీపాలతో అన్ని చర్చిలూ ధగధగా మెరిసిపోతున్నాయి. క్రైస్తవులకు అత్యంత ప్రీతిపాత్రమైన ఆదివారం రోజున క్రిస్మస్ పండగ వచ్చింది. ఇక నగరంలోని చర్చిలు అన్ని ఒకటైతే, పాత నగరంలో కొలువుదీరిన పురాతన క్రైస్తవ చర్చిలు ఒక ఎత్తు. వందల ఏళ్ల కిందట అప్పటి బ్రిటిష్, ఇతర దేశాల నుంచి వచ్చిన క్రీస్తు విశ్వాసుల కోసం పాత నగరంలో అనేక చర్చిలను నిర్మించారు. ఆయా చర్చిలు ఇప్పటికీ, ఆధ్యాత్మిక సేవా పరిమళాలను వెదజల్లుతూనే ఉన్నాయి. పాత నగరం 36వ వార్డు రీడింగ్ రూమ్ సమీపంలో సెయింట్ ఆన్స్ చర్చికి 166 ఏళ్ల చరిత్ర ఉంది. నగరంలోని మొట్టమొదటి కేథలిక్ చర్చి ఇదే. ఆంగ్లో ఇండియన్లు, ఆర్మీ అధికారులు, సిబ్బంది ఇక్కడ ప్రార్ధనలో పాల్గొనేవారు. తూర్పు కోస్తా రైల్వే యాజమాన్యం 18వ శతాబ్దంలో వాల్తేర్ రైల్వే డివిజన్‌ను నిర్మించింది. ఆ సమయంలో ఇక్కడ పనిచేసే కేథలిక్ రైల్వే ఉద్యోగుల కోసం జ్ఞానాపురం ప్రాంతంలో నాటి బిషప్ క్లర్క్ 1892లో 18 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. అందులో 1903లో ఆంగ్లం మాట్లాడే వారి కోసం సెయింట్ జోసెఫ్ చర్చిని నిర్మించారు. అలాగే పాత నగరంలోని సోల్జర్పేట ప్రాంతంలో నాటి బ్రిటిష్ ప్రభుత్వంలో పని చేసే ఆర్మీ అధికారులు, సిబ్బందితో పాటు స్థానికుల కోసం 1872లో క్రీస్తు హృదయం పేరుతో షే క్రెడ్ హార్ట్ చర్చిని నిర్మించింది. సముద్ర తీరానికి దగ్గరలో నిర్మించడంతో ఈ చర్చి ప్రమాదకరంగా మారింది ఈ నేపథ్యంలో 1930లో ప్రభుత్వం నుంచి స్థలాన్ని కొనుగోలు చేసి సరికొత్త డిజైన్‌తో 1932లో మరొక చర్చిని నిర్మించారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత పాత నగరంలో మరికొన్ని చోట్ల చర్చిలను నిర్మించారు. అటువంటి వాటిలో చిత్రాలయ థియేటర్ ఎదురుగా లూథరన్ చర్చి, గ్రీన్ పార్క్ హోటల్ రోడ్డులో మరొక చర్చిని నిర్మించారు. అలాగే అల్లిపురం స్టేషన్ రోడ్‌లో కల్వరి బాప్టిస్ట్ చర్చిని నిర్మించారు. మద్దిలపాలెం రేసపువాని పాలెం వద్ద క్యూ ఎంబి చర్చిని నిర్మించారు. ఎన్ఎడి జంక్షన్‌లో బాప్టిస్ట్ చర్చిని నిర్మించారు. అలాగే సీతమ్మధార, ఎంవిపి.కాలనీ తదితర ప్రాంతాల్లో కూడా పెద్ద పెద్ద చర్చిలను నిర్మించారు. ఇవన్నీ కూడా క్రిస్మస్ వేడుకలకు అందంగా అలంకరించబడ్డాయి..



విశాఖ నగరంలో ముస్తాబయిన చర్చి

